- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
12-05-2026

సంపుటి : 01 సంచిక :51 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 51 NAMASTEY MAHAAPRABHA




## అన్నాడీఎంకేలో అసమ్మతి చిచ్చు!

- ఈపీఎస్ రాజీనామాకు వైరి వర్గం డిమాండ్

చెన్నై మే 11 (మహాప్రభ)
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే ఘోర పరాజయం నేపథ్యంలో ఆ పార్టీలో కొత్తగా అసమ్మతి సంకేతాలు వెలువడ్డాయి. పార్టీ అధినేత ఎడప్పాడి కే పళనిస్వామి రాజీనామా చేయాలని కొందరు ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీలోని కొన్ని వర్గాల నుంచి ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ రాజీనామా చేయడానికి ఈపీఎస్ సుముఖంగా లేరని ఆ వర్గాలు తెలిపాయి.పార్టీ ఉన్నత వర్గాల సమాచారం ప్రకారం సీనియర్ పార్టీ నాయకుడు సీవీ షణ్ముగంతో విధేయంగా ఉన్న ఎమ్మెల్యేలు పలువురు -మిగతా 3 లో

## ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు తలొగ్గం

అణు పరీక్షల ద్వారా ఇప్పటికే భారత్ సత్తా చాటాం



- చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం
- 75 ఏళ్ల సోమనాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణంపై 'అమృత్ మహోత్సవం'
- స్మారక నాణెం విడుదల చేసిన ప్రధాని

న్యూఢిల్లీ: మే 11 (మహాప్రభ)
ప్రపంచంలోని ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించామని గుర్తు చేశారు. గుజరాత్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమనాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వేదికపై నుంచి 75 ఏళ్ల పునర్నిర్మాణానికి గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపుతో పాటు 75 రూపాయల స్మారక నాణేన్ని ప్రధాని విడుదల చేశారు. -మిగతా 3 లో

## కార్మికుల సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

- వివిధ రంగాల్లో వారి స్థితిగతులను మెరుగు పరుస్తాం
- వారి జీవన ప్రమాణాలను మరింతగా పెంచుతాం
- కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ మే 11 (మహాప్రభ)
తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను మెరుగు పరిచేందుకు, వారికి మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించేందుకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు
-మిగతా 3 లో



## ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్!

- పంజాబ్‌పై 3 వికెట్ల తేడాతో డీసీ విజయం
- 211 పరుగుల లక్ష్యాన్ని 19 ఓవర్లలో ఛేజ్
- అక్షర్ పటేల్.. కెప్టెన్ ఇన్నింగ్స్..
- వరుసగా నాలుగో ఓటమి చవిచూసిన పంజాబ్

న్యూఢిల్లీ మే 11 (మహాప్రభ)
ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో ప్లే ఆఫ్స్ దిశగా అడుగులు వేసిన పంజాబ్ కింగ్స్.. వరుసగా నాలుగో మ్యాచులో పరాజయం పాలైంది. సోమవారం ధర్మశాల వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచులో 3 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఓడినా పాయింట్స్ టేబుల్‌లో మాత్రం టాప్-4లోనే -మిగతా 3 లో



## బెంగాల్‌నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం

- సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం
- ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

కోల్‌కతా, మే 11 (మహాప్రభ)
పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ పక్రియ -మిగతా 3 లో

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

విద్యార్థులకు రూ.వెయ్యి కోట్లతో 9 రకాల వస్తువులతో ఎడ్యుకేషన్ కిట్

- నాణ్యత లేకుంటే ఆ కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టి బొక్కలో వేస్తాం
- ఉత్తమ టీచర్లకు జూన్ 2న, డిసెంబర్ 9న సన్మానం
- ఏటా 500 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తాం
- విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- క్యూర్ పరిధిలో రూ.1700 కోట్లతో విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి

హైదరాబాద్ మే 11 (మహాప్రభ)
తెలంగాణ విద్యావిధానాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్ది ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రవేశపెట్టబోతున్నామని స్పష్టం చేశారు. టెన్త్ తర్వాత విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారనీ, దాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోనీ ఎల్బీ స్టేడియంలో విద్యా వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించారు. అందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ లోపల క్యూర్ పరిధిలోని విద్యా సంస్థల్లో రూ.1700 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూవిద్యాసంస్థలు, యూనివర్సిటీలు విద్యను నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ సమాజం -మిగతా 3 లో





## జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

- ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం
- ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారు
- ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

3 లో



## సర్‌తో ఫలితాలు తారుమారు!

- 31 స్థానాల్లో బీజేపీ మెజారిటీ కన్నా సర్‌లో తొలగించిన ఓట్లే ఎక్కువ
- సుప్రీంకోర్టుకు తెలిపిన తృణమూల్
- దీనిపై కొత్తగా పిటిషన్లు దాఖలు చేయొచ్చని కోర్టు సూచన

3 లో



## బండి భగీరథ్ కేసుపై సిట్ ఏర్పాటు

- తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేసు
- సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు

హైదరాబాద్ మే 11 (మహాప్రభ)
తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి కేసులో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు సున్నితమైనది కావడంతో దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు.
-మిగతా 3 లో

## విచారణకు సహకరించండి



- దోషులు ఎవరైనా చట్టం ముందు తప్పించుకోలేరు
- బీసీ అంశాన్ని రాజకీయంగా వాడుకోవడం సరికాదు
- తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- బండి సంజయ్ కుమారుడి వ్యవహారంపై మంత్రి పొన్నం ప్రభాకర్

3

## సాధారణ జవాన్లతో అగ్నివీర్లు సమానం కాదు

- ఒకే విధమైన 'డెత్ బెనిఫిట్స్' రావు: కేంద్రం



న్యూఢిల్లీ: మే 11 (మహాప్రభ)
అగ్నివీర్లు.. సాధారణ సైనికులతో సమానం కాదని, ఇద్దరికీ ఒకే విధమైన 'డెత్ బెనిఫిట్స్' ఉండవని కేంద్రం స్పష్టం చేసింది. పాకిస్థాన్ కాల్పుల్లో మరణించిన అగ్నివీర్ తల్లి దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయగా, పై విషయాన్ని దాంట్లో పేర్కొన్నది. సాయు ధ దళాల్లో 'అమరవీరుడు' అనే పదాన్ని ఉపయోగించరని కూడా కేంద్రం తెలిపింది. -మిగతా 3 లో


# కుర్చీ నుంచి కిందపడ్డ వరుడు..

-పెళ్లికి నిరాకరించిన వధువు..
- హెల్త్ రిపోర్టు ఇవ్వాలని డిమాండ్



**ఇటా మే 11 (మహాప్రభ)**
ఉత్తరప్రదేశ్‌లో ఓ వధువు.. వరుడి నుంచి మెడికల్ సర్టిఫికేట్ డిమాండ్ చేసింది. పెళ్లి వేడుక సమయంలో వరుడు కూర్చీ నుంచి కిందపడిపోయాడు. దీంతో అక్కడ హైరానా ఏర్పడింది. కొందరు అతనికి నీళ్లు తాగించారు. కొందరు డాక్టర్ కోసం పరుగులు తీశారు. భారీ ఊరేగింపు నడుమ పెళ్లి వేదికకు వరుడు చేరుకున్న తర్వాత ఈ ఘటన చోటుచేసుకున్నది. అయితే పెళ్లి సంబరాల వేళ వరుడు కుర్చీ నుంచి కిందపడిపోవడం పట్ల వధువు అభ్యంతరం వ్యక్తం చేసింది. వరుడికి ఆరోగ్య పరీక్షలు చేయించాలని పట్టుపట్టింది. హెల్త్ రిపోర్టు ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని భీష్మించింది. రెండు వర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ జరిగింది. అయినా ఆ అమ్మాయి వినలేదు. ఇటా జిల్లాలోని కథోని గ్రామానికి చెందిన వరుడు .. సాకిత్ గెస్ట్ హౌజ్ చేరుకున్న తర్వాత ఈ ఘటన జరిగింది. వరుడి ఆరోగ్యంపై వధువు కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేయడంతో పెళ్లి ఆగిపోయింది. వరుడి ఆరోగ్యం గురించి దాచి పెట్టారని వధువు ఫ్యామిలీ ఆరోపించింది. కానీ ఈ ఘటన గురించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కాలేదు.

# రన్‌వేపై ఉన్న వ్యక్తిని ఇంజిన్‌లోకి లాక్కున్న విమానం..!




**న్యూఢిల్లీ మే 11 (మహాప్రభ)**
కంచె దాటి ఎయిర్‌పోర్టులోకి వచ్చిన ఓ వ్యక్తి రన్‌వే దాటుతుండగా.. ఓ భారీ ఎయిర్‌బస్ ఏ-321 విమానం అతడిని ఇంజిన్‌లోకి లాగేసుకుంది. అమెరికా లోని కొలరాడో లో ఈ ఘటన చోటుచేసుకొంది. స్థానిక డెన్వర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లో ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టేకాఫ్ అయ్యే సమయంలో ఓ వ్యక్తి హఠాత్తుగా కంచె దూకి రన్‌వేకు అత్యంత సమీపంలోకి వచ్చాడు. దాంతో అతడిని విమానం ఇంజిన్ ఒక్కసారిగా లోపలకు లాగేసుకోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. అతడి శరీరం పైభాగం ఇంజిన్‌లో ఇరుక్కుపోయింది. ఇంజిన్ నుంచి భారీగా మంటలు వెలువడ్డాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో విమానం గంటకు 139 మైళ్ల వేగంతో ప్రయాణిస్తోంది. విమానం లోపల కూర్చున్న ప్రయాణికులకు ఇంజిన్‌లో నుంచి మనిషి కాళ్లు కనిపించడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇంజిన్ నుంచి భారీ శబ్దాలు వినిపించడంతోపాటు మంటలు వెలువడ్డాయి. దాంతో విమానం టేకాఫ్‌ను నిలిపేసి ప్రయాణికులు, సిబ్బందిని సురక్షితంగా కిందకు దించేశారు.

# భార్యకు గౌరవంగా జీవించే హక్కుంది

-ఆమెను పశువులా చూడొద్దు
-గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ మే 11 (మహాప్రభ)**
భార్యను పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గృహహింస కేసు విచారణలో భాగంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌పై విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఆ పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. నిందితుడు మద్యం మత్తులో ఆ మహిళపై దాడి చేశాడని బాధితురాలి తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు బలంగా గాయమైనట్టు, ఆ తర్వాత కర్రతో కూడా దాడి చేసినట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు నిందితుడు మూడు వివాహాలు చేసుకోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలైన మొదటి భార్య వాదనలు విన్న న్యాయస్థానం.. “మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు..? ఇలాగే వేధిస్తే.. ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి” అంటూ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

# ఎంపీల సంఖ్యను 850కి పెంచడం ఓ జోక్



**న్యూఢిల్లీ మే 11 (మహాప్రభ)**
పునర్విభజన ప్రక్రియ ద్వారా లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కి పెంచాలని కేంద్రం భావిస్తున్న విషయం తెలిసిందే. ఈ దిశగా ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు వీగిపోయింది. అయితే ఈ నేపథ్యంలో ఆ అంశంపై సీనియర్ కాంగ్రెస్ నేత, ఎంపీ శశిథరూర్ స్పందించారు. దిగువ సభ సంఖ్యను 850కి పెంచడం ఓ జోక్ అవుతుందన్నారు. చైనా పీపుల్స్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్‌కు ఇది దేశీ వర్షన్ అవుతుందని ఆయన విమర్శించారు. కాలిఫోర్నియాలో జరుగుతున్న స్టాన్‌ఫోర్డ్ ఇండియా కాన్‌ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. లోక్‌సభ సంఖ్యను 850కి పెంచితే అప్పుడు చైనా పార్లమెంట్ తరహాలో బల్లలు బాదడం తప్ప ఏమీ ఉండదన్నారు. ఎంపీలకు మాట్లాడేందుకు, వాదించేందుకు, చర్చించేందుకు అవకాశం ఉండదని, 850 ఓ జోక్ అని శశిథరూర్ అన్నారు. 1929 నుంచి అమెరికా జనాభా మూడు రెట్లు పెరిగిందని, కానీ అమెరికా చట్టసభలో హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ సంఖ్య 435గానే ఉందన్నారు. 850 మందితో డిబేట్ చేయలేమన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లును , డీలిమిటేషన్‌తో ముడి పెట్టరాదన్నారు. 2027 నుంచి 2029 మధ్య రిలీజయ్యే జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. 2034 నాటికి దేశంలో కొత్త రాజకీయ ముఖచిత్రం ఉంటుందన్నారు. ఇదే కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న బీజేపీ నేత, ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతూ డీలిమిటేషన్ అనేది ప్రజాస్వామ్య ప్రక్రియ అన్నారు. పార్లమెంట్‌లో ఎంపీల సంఖ్యను 543కు కట్టడి చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుత జనాభా 140 కోట్లు ఉందని, కానీ 1971 నాటి జనాభా ప్రకారం లోక్‌సభ ఎన్నికలు నిర్వహించడం సరికాదన్నారు.
మరో బీజేపీ నేత కే అన్నామలై మాట్లాడుతూ డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల్లో భిన్న సమస్యలు వస్తాయన్నారు. తమిళనాడులో ఫెర్టిలిటీ రేటు తగ్గిందని, ఇక జనాభా లెక్కలు రిలీజైన తర్వాత సహజంగానే ఉత్తరాదికి ఎక్కువ సంఖ్యలో ఎంపీ సీట్లు వెళ్తాయన్నారు. దీనివల్ల సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు.

# విజయ్ పరిపాలన వివాదంతో మొదలు

-రాష్ట్ర గీతానికి మూడో స్థానంపై డీఎంకే ఫైర్





**న్యూఢిల్లీ మే 11 (మహాప్రభ)**
తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణస్వీకారం సందర్భంగా ఆలపించిన గీతాల క్రమం సక్రమంగా లేదని డీఎంకే మండిపడింది. ముందుగానే ఆలపించాల్సిన రాష్ట్ర గీతాన్ని మూడో స్థానంలో ఆలపించడాన్ని ఆ పార్టీ తప్పుపట్టింది. దాంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే విజయ్ ఓ పెద్ద వివాదంలో చిక్కుకున్నారు. ప్రమాణ స్వీకార వేడుకలో గీతాల ఆలాపన క్రమాన్ని మార్చి తమిళ గీతాన్ని అవమానించారని డీఎంకేతోపాటు వామపక్షాలు, వీసీకే కూడా విమర్శిస్తున్నాయి. ప్రమాణ స్వీకార కార్యక్రమం 'వందేమాతరం' గేయంతో ప్రారంభమైంది. ఆ తర్వాత జాతీయ గీతం 'జనగణమన', చివరగా తమిళనాడు రాష్ట్ర గీతమైన 'తమిళ తాయ్ వాళ్తు'ను ఆలపించారు. సాధారణంగా తమిళనాడు ప్రభుత్వ కార్యక్రమాల్లో 'తమిళ తాయ్ వాళ్తు' ను మొదట, జాతీయ గీతాన్ని చివరగా పాడటం సంప్రదాయం. కానీ ఈ సంప్రదాయానికి భిన్నంగా రాష్ట్ర గీతాన్ని మూడో స్థానానికి నెట్టడంపై ప్రతిపక్ష డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ ఘటనను డీఎంకే తీవ్రంగా పరిగణించింది. ఇది తమిళ సంస్కృతిని, సంప్రదాయాలను అవమానించడమేనని డీఎంకే ఆరోపించింది. సీఎం విజయ్, ఆయన పార్టీ బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారనడానికి ఇదే నిదర్శనమని డీఎంకే నేతలు విమర్శించారు. ముఖ్యమంత్రిగా తొలి అడుగులోనే విజయ్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. ఈ వివాదంపై విజయ్ పార్టీ టీవీకే స్పందించింది. ప్రమాణ స్వీకార కార్యక్రమం రాజ్‌భవన్‌లో జరిగిందని, అక్కడి కార్యక్రమమం అంతా గవర్నర్ కార్యాలయం నిర్ణయం మేరకే జరిగిందని వివరణ ఇచ్చింది. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గత జనవరిలో జారీ చేసిన ఆదేశాల ప్రకారమే గీతాల ఆలాపనలో ఈ క్రమాన్ని పాటించినట్లు టీవీకే పేర్కొన్నది. అయినప్పటికీ డీఎంకే వివరణతో టీవీకే సంతృప్తి చెందలేదు. కేవలం డీఎంకేనే కాకుండా విజయ్ మిత్రపక్షాలైన సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే కూడా ఈ ఘటనపై వివరణ కోరాయి. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకూడదని సూచించాయి. ఈ పరిణామాలతో విజయ్ రాజకీయ ప్రస్థానాన్ని తొలిరోజే వివాదాలతో ప్రారంభించినట్లయ్యింది.

# ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌ను ధ్వంసం చేసిన హెజ్బొల్లా..!



**న్యూఢిల్లీ మే 11 (మహాప్రభ)**
లెబనాన్ దేశానికి చెందిన మిలిటెంట్ సంస్థ హెజ్‌బొల్లా తాజాగా ఇజ్రాయెల్ కు షాకిచ్చింది. అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థగా పేరుపొందిన ఐరన్ డోమ్ ను ఛేదించగలిగింది. ఐరన్ డోమ్ వ్యవస్థలో కీలక భాగమైన మిసైల్ లాంచింగ్ యూనిట్‌ను ఎఫ్‌పీవీ డ్రోన్‌తో ధ్వంసం చేసినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఫుటేజీని కూడా విడుదల చేసింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం కొన్నిరోజుల క్రితమే ఈ దాడి జరిగింది. అయితే ఈ దాడి ఫుటేజీని సేకరించేందుకు హెజ్బొల్లా కొంత సమయం తీసుకున్నట్టు సమాచారం. హెజ్బొల్లా ప్రకటనపై ఇజ్రాయెల్ డిఫెన్స్ దళాలు ఇంకా స్పందించలేదు. ఎఫ్‌పీవీ డ్రోన్స్‌ను అడ్డుకోవడం ఇజ్రాయెల్ దళాలకు సవాలుగా మారిందన్న వార్తలు ఇప్పటికే అనేకం వెలువడ్డాయి. సంప్రదాయక మిసైల్స్, రాకెట్స్, డ్రోన్స్‌ను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ అభివృద్ధి చేసుకున్న ట్రాకింగ్ వ్యవస్థలు, జామర్లు ఎఫ్‌పీవీ డ్రోన్‌ల విషయంలో తడబడుతున్నట్టు సమాచారం. రేడియో సిగ్నల్స్, జీపీఎస్ ద్వారా సంప్రదాయక డ్రోన్స్ తమ లక్ష్యాన్ని చేరుకుంటాయి. ఈ సిగ్నల్స్‌ను జామ్‌చేసి ఇజ్రాయెల్ వాటిని ధ్వంసం చేస్తోంది. అయితే, ఎఫ్‌పీవీ డ్రోన్స్‌కు అనుసంధానమై ఉన్న ప్రత్యేక ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ద్వారా ఆపరేటర్లు వాటిని నియంత్రిస్తారు. డ్రోన్స్‌కు ఉన్న కెమెరాల ద్వారా అందే దృశ్యాలను చూస్తూ వాటిని లక్ష్యం వైపు నడిపిస్తారు. ఈ ఆప్టిక్ తీగల్లోని సిగ్నల్స్‌ను అడ్డుకోవడం జామర్స్‌కు సాధ్యం కాదు. ఫలితంగా ఎఫ్‌పీవీ డ్రోన్స్ తమ లక్ష్యాలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ ముప్పు గురించి ఇజ్రాయెల్ సైనికాధికారి ఒకరు ముందే అప్రమత్తం చేశారు. ఎఫ్‌పీవీ దాడుల నుంచి ఐరన్ డోమ్‌ను కాపాడుకోలేకపోతే నష్టం మరింత పెరుగుతుందని అన్నారు. ఇక పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇజ్రాయెల్ పలు ప్రయత్నాలు చేస్తోంది. ఎఫ్‌పీవీ డ్రోన్స్‌ను నుంచి ఐరన్ డోమ్ యూనిట్లకు రక్షణ భారీ వలలను ఏర్పాటు చేస్తోంది. ఈ వలలకు ఎఫ్‌పీవీ డ్రోన్స్ చిక్కి విఫలమవుతాయని ఇజ్రాయెల్ చెబుతోంది.

# సోమ్‌నాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించారు



**న్యూఢిల్లీ మే 11 (మహాప్రభ)**
ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పై తీవ్ర విమర్శలు చేశారు. స్వాతంత్ర్యానంతరం గుజరాత్ లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ ఆత్మగౌరవాన్ని పక్కనపెట్టే శక్తులు దేశంలో ఇప్పటికీ ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్'లో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '1951లో సోమనాథ్ ఆలయ పునఃప్రతిష్ఠ కేవలం ఒక సాధారణ విషయం కాదు. అది భారతదేశ స్వతంత్ర నాగరిక స్పృహకు ప్రతీక' అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆలయ పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ల సేవలను ప్రధాని కొనియాడారు. దేశంలోని 500కు పైగా సంస్థానాలను ఏకంచేసి ఆధునిక భారతాన్ని నిర్మించిన సర్దార్ పటేల్, సోమనాథ్ పునర్నిర్మాణం ద్వారా మన ప్రాచీన వైభవాన్ని తిరిగి పొందుతున్నామన్న సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చారని మోదీ వివరించారు. అయితే ఈ మహత్కార్యానికి నెహ్రూ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందని మోదీ ఆరోపించారు. 'ఆలయ పునర్నిర్మాణం కోసం సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ ఎంతో కృషిచేశారు. కానీ వారికి నెహ్రూజీ నుంచి ఎంత వ్యతిరేకత వచ్చిందో మనందరికీ తెలుసు. ఈ రోజు నేను ఆ వివరాల్లోకి వెళ్లడం లేదు. కానీ సర్దార్ పటేల్ సంకల్పం ముందు ఏదీ నిలవలేదు. శతాబ్దాల అవమానాన్ని చెరిపేస్తూ సోమనాథ్ ఆలయం పునర్నిర్మితమైంది..' అన్నారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని ప్రస్తుత రాజకీయాలతో ముడిపెడుతూ.. జాతీయ ఆత్మగౌరవం కంటే బుజ్జగింపు రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చే శక్తులు ఇప్పటికీ ఉన్నాయన్నారు.

# ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్!

మొదటి తరువాయి

కొనసాగుతోంది. మరోవైపు టోర్నీలో ఐదో విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్స్ టేబుల్‌లో ఏడో ప్లేసుకు చేరుకుంది. ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 210/5 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (59), ప్రియాన్ష్ ఆర్యా (56) హాఫ్ సెంచరీలు సాధించారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ అనూహ్య విజయం అందుకుంది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు విఫలమైనా.. మిగతా వారంతా తలా ఓ చేయి వేయడంతో విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయని కెప్టెన్ అక్షర్ పటేల్.. ఈ మ్యాచులో రాణించాడు. 30 బంతుల్లో 56 పరుగులు స్కోరు చేశాడు. డేవిడ్ మిల్లర్ సైతం 28 బంతుల్లో 51 రన్స్ చేసి.. డీసీని విజయం దిశగా తీసుకెళ్లాడు. అశుతోష్ శర్మ (10 బంతుల్లో 24 రన్స్), మాధవ్ తివారీ (8 బంతుల్లో 18 రన్స్ నాటౌట్), అకబ్ నబీ (2 బంతుల్లో 10 రన్స్) బ్యాట్ ఝుళిపించడంతో డీసీ సరిగ్గా 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేజ్ చేసింది. ఈ విజయంతో మిణుకుమిణుకు మంటున్న ప్లే ఆఫ్స్ ఆశలను డీసీ సజీవంగా ఉంచుకుంది. డీసీ మిగిలిన రెండు మ్యాచులలో గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 14 పాయింట్లు చేరనున్నాయి. అప్పుడు నెట్ రన్ రేట్ ఆధారంగా డీసీ ముందంజ వేసే అవకాశం ఉంది. మరోవైపు పంజాబ్ కింగ్స్.. ప్లే ఆఫ్స్‌కు ముందు అనూహ్యంగా తడబడుతోంది. తొలి ఏడు మ్యాచులలో పరాజయం ఎరుగని ఆ జట్టు.. ఆ తర్వాత వరుసగా నాలుగింట్లో ఓడిపోయింది. అయినా 13 పాయింట్లతో టేబుల్‌లో నాలుగో ప్లేసులో ఉంది.

## బెంగాల్‌నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటి తరువాయి

పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు. బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఇతర పథకాలనూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

## బండి భగీరథ్ కేసుపై సిట్ ఏర్పాటు

మొదటి తరువాయి

బాధితురాలు బాలిక కావడం, ఈ కేసులో ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా విచారణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్ బృందం ఇప్పటికే కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు సమాచారం. పోలీసులు బాలిక స్టేట్మెంట్ను చట్టపరమైన నిబంధనల ప్రకారం రికార్డ్ చేశారు. ఈ ప్రకటన ఆధారంగా మరిన్ని అంశాలను వెలికి తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు కూడా పరిశీలించే అవకాశముంది.

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

ఈ ఘటనపై హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో భగీరథ్పై కేసు నమోదు చేశారు. బాలిక ఫిర్యాదు, ప్రాథమిక ఆధారాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. పోలీసులు పోక్సో చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాలికకు సంబంధించిన కేసు కావడంతో చట్టపరమైన ప్రక్రియలను అత్యంత జాగ్రత్తగా అమలు చేస్తున్నారు.

## సాధారణ జవాన్లతో అగ్నివీర్లు సమానం కాదు

మొదటి తరువాయి

వారి కుటుంబ సభ్యులకు అందే పెన్షన్ ప్రయోజనాల విషయంలో సాధారణ సైనికులతో సమానంగా అగ్నివీర్లకు బెనిఫిట్స్ ఉండవని కేంద్రం బాంబే హైకోర్టుకు తెలియజేసింది. గత ఏడాది 'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్ సైన్యం జరిపిన మోర్టార్ దాడుల్లో పూంచ్‌లో మురళీ నాయక్ అనే అగ్నివీర్ వీరమరణం పొందాడు. స్వల్పకాలిక నియామక పథకం కింద చేరిన 'అగ్నివీర్ల' కుటుంబాలకు దీర్ఘకాలిక పెన్షన్, ఇతర సంక్షేమ ప్రయోజనాల్ని కేంద్రం నిరాకరిస్తున్నదని మురళీ నాయక్ తల్లి కోర్టును ఆశ్రయించింది.

## అన్నాడీఎంకేలో అసమ్మతి చిచ్చు!

మొదటి తరువాయి

మాజీ మంత్రులతో కలసి వరుసగా నాలుగు ఎన్నికల ఓటముల తర్వాత ఆయన నాయకత్వాన్ని ఇకపై అంగీకరించడానికి సిద్ధంగా లేమని ఈపీఎస్‌కు తెలియచేశారు. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే 234 స్థానాలకు గాను కేవలం 47 స్థానాలను గెలుచుకుంది.

## కార్మికుల సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

మొదటి తరువాయి

వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరి చందన, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో వేతనాల సవరణ శాస్త్రీయంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతనాల విధానాలను కమిటీ కూలంకషంగా పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకురానున్న నూతన 'లేబర్ కోడ్' అంశాల ప్రభావం ఎలా ఉండబోతోందనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మికుల వేతనాలను కేవలం అంకెల్లో కాకుండా, వారి వాస్తవ అవసరాలకు అనుగుణంగా సవరించాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు ఉండాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. దేశంలోని అత్యుత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయ పడింది. తెలంగాణను కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. త్వరలోనే అన్ని వర్గాల అభిప్రాయాలను క్రోడీకరించి, కార్మికులకు మేలు చేకూర్చే విధంగా కనీస వేతనాల సవరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

మొదటి తరువాయి

బలహీనపడుతుందని వివరించారు. పేదలకు న్యాయమైన విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. రాష్ట్రంలోని తండాలు, గూడేలు, మారుముల గ్రామాల్లోని పేదలు, దళితులు, గిరిజనులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖను తన దగ్గర ఉంచుకున్నానని అన్నారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు.

1.5 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని చెప్పారు. 12 వేల ప్రయివేటు స్కూళ్లలో 38 లక్షల మంది చదువుతున్నారని వివరించారు. ప్రయివేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటీ, ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న లోపం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యాశాఖకు ఎనిమిది శాతం నిధులను కేటాయించామన్నారు. దశల వారీగా విద్యకు 15 శాతం నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ విద్యలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా నిలబట్టడమే లక్ష్యమని ప్రకటించారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని అన్నారు. 25 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విద్యా విధానం పరిశీలనకు ఫిన్లాండ్‌కు పంపించామని వివరించారు. అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి 500 మందిని విదేశాలకు పంపిస్తామన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ రెండున, తెలంగాణ తల్లి జన్మదినం డిసెంబర్ తొమ్మిదిన ఉత్తమ టీచర్లకు సన్మానం చేస్తామని వివరించారు. పేద విద్యార్థులు ఆర్థాకలితో పాఠశాలలకు వస్తున్నారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందిస్తామని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు పాలు, రాగిజావ అందిస్తామన్నారు. కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అద్భుతంగా అందిస్తున్నామని అన్నారు.

ప్రభుత్వం పాఠశాల్లో చదవే విద్యార్థులు తమ పిల్లలతో సమానమని చెప్పారు. తల్లిదండ్రుల్లా తమ ప్రభుత్వం విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటుందని వివరించారు. విద్యాశాఖపైన పెట్టే ఖర్చును భవిష్యత్తు తరాల పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు. 100 నియోజకవర్గాల్లో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూళ్లను రూ. 200 కోట్లతో నిర్మిస్తున్నామని వివరించారు. పేద బిడ్డలు ధైర్యంగా వాటిలో చదువుకున్నామని చెప్పాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. పాఠశాలలు టీచర్లు, ఐఏఎస్‌లు, రాజకీయ నాయకుల కోసం కాదనీ, పేద విద్యార్థుల కోసం, వారి సంక్ష??ఆమం కోసమని అన్నారు. ఏ నిర్ణయమైనా వెనకడుగు వేయకుండా తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే ఎడ్యుకేషన్ కిట్ నాణ్యతను తాను స్వయంగా పరిశీలించానని అన్నారు. ఎడ్యుకేషన్ కిట్ కోసం రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. నాణ్యమైన వస్తువులు రాకపోతే తక్షణమే ప్రజా ప్రతినిధుల దృష్టికి తేవాలని సూచించారు. నాణ్యత లేని వస్తువులను సరఫరా చేస్తే కంపెనీలను బ్లాక్ లిస్టులో చేరుస్తామనీ, వారిని బొక్కలో వేయించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరైన సమయంలో విద్యార్థులకు చేరాలన్నారు. పాఠశాల ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు ఒక జత బట్టలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మరో జత నెలాఖారున ఇవ్వాలని చెప్పారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకూ నూటికి నూరు శాతం మార్కులు రావాలన్నదే తన స్వప్నమని అన్నారు. టీచర్లకు మొదటి తారీఖున జీతంతో పాటు మౌలిక సదుపాయలు కల్పించే బాధ్యత తనదని చెప్పారు.

ప్రభుత్వ టీచర్లది ఉద్యోగం కాదనీ, భావోద్వేగమనీ, అది బరువు కాదనీ బాధ్యత అని అన్నారు. 19 లక్షల మంది విద్యార్థుల కుటుంబాల భవిష్యత్తు ప్రభుత్వ ఉపాధ్యాయుల చేతిలో ఉందన్నారు. పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కండ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పని చేయాలని కోరారు. విద్యాశాఖకు మంత్రి లేరని కొందరు మాట్లాడుతున్నారనీ, సమీక్ష సమయంలో తనను ముఖ్యమంత్రిగా కాకుండా విద్యా శాఖ మంత్రిగా చూడాలని కోరారు. మంచి విద్యను అందించాలనీ, ఉత్తమ పౌరులను తయారు చేయాలని సూచించారు. త్వరలోనే విద్యా శాఖలో మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, సలహాదారులు కె కేశవరావు, హార్కర వేణుగోపాల్, విహెచ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నవీన్ యాదవ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు .

## సర్‌తో ఫలితాలు తారుమారు!

**-31 స్థానాల్లో బీజేపీ మెజారిటీ కన్నా సర్‌లో తొలగించిన ఓట్లే ఎక్కువ**
**-సుప్రీంకోర్టుకు తెలిపిన తృణమూల్**
**-దీనిపై కొత్తగా పిటిషన్లు దాఖలు చేయొచ్చని కోర్టు సూచన**

**కోల్‌కతా**




పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రక్రియ.. బీజేపీ ఎన్నికల విజయానికి దోహదపడిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 31 స్థానాల్లో బీజేపీ సాధించిన ఓట్ల మెజారిటీ కన్నా..'సర్' పేరుతో తొలగించినవే ఎక్కువగా ఉన్నాయని తాజాగా గణాంకాలు బయటకు వచ్చాయి. బెంగాల్ వ్యాప్తంగా కేంద్రం చేపట్టిన 'సర్' ప్రక్రియ ఎన్నికల ఫలితాల్నే తారుమారు చేసిందని మాజీ సీఎం, తృణమూల్ నాయకురాలు మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టులో తృణమూల్ సోమవారం తన వాదనను వినిపిస్తూ, 'సర్' ఓట్ల తొలగింపు పలు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్ని గణనీయంగా ప్రభావితం చేసిందని తెలిపింది. ఈ వాదనను ఈసీ వ్యతిరేకించగా, ఈ అంశంపై కొత్తగా పిటిషన్ దాఖలు చేయాలని మమతా బెనర్జీకి ధర్మాసనం సూచించింది. సోమవారం సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. తృణమూల్ నాయకుడు కల్యాణ్ బెనర్జీ వాదనలు వినిపిస్తూ, ఒక స్థానంలో విజేతకు లభించిన ఆధిక్యం, తొలగించిన ఓటర్ల సంఖ్య కంటే తక్కువగా ఉంటే.. ఇది న్యాయసమీక్ష అర్హమైనదిగా జస్టిస్ బాగ్చి గతంలో చేసిన వ్యాఖ్యను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'చాలా చోట్ల ఓట్ల తొలగింపు.. అభ్యర్థి ఓటమికి కారణమైన ఓట్ల తేడాకు సమానంగా ఉంది. ఒక నియోజకవర్గంలో ఒక అభ్యర్థి కేవలం 862 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. అక్కడ 'సర్' పేరుతో 5,432 ఓట్లను తీసేశారు. తృణమూల్, బీజేపీకి మధ్య 32 లక్షల ఓట్ల తేడా కనపడగా, అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌లో 35 లక్షల అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి' అని కల్యాణ్ బెనర్జీ సుప్రీం కోర్టుకు తెలియజేశారు.

## జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

- ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం
- ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారు
- ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ,**

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

## ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు తలొగ్గం

మొదటి తరువాయి

ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం ప్రధాని సద్భావన మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. "సోమనాథ్ దేవాలయ అభివృద్ధిలో శివుడి ఆశీస్సులు ఉన్నాయి. సోమనాథ్ దేవాలయ రూపురేఖలు పూర్తిగా మారుతున్నాయి. 1951లో సోమనాథ్ దేవాలయ పునర్నిర్మాణం చేపట్టాం. భారత్ తన ప్రాచీన సంస్కృతిని, వారసత్వాన్ని కూడా పరిరక్షించుకుంటుంది. సోమనాథ్ పునర్నిర్మాణ పనుల ద్వారా దీన్ని ప్రపంచానికి చాటాం. భారత్ అంటే వేల ఏళ్ల ఆధ్యాత్మిక చైతన్యం కలిగిన దేశం. అసత్యంపై ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని మన పూర్వీకులు నిరూపించారు. 1998 మే 11న ఇదేరోజు పోఖ్రాన్ లో అణు పరీక్షలు చేపట్టాం. 1998లో అణు పరీక్షల ద్వారా భారత్ సత్తా చాటాం. అప్పటి అణుపరీక్షలు చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి. అణు పరీక్షల తర్వాత అనేక ఆంక్షలు విధించి ఇబ్బంది పెట్టారు. మనం ఎవరి ఆంక్షలకు తలొగ్గలేదు ధైర్యంగా నిలబడ్డాం. 1998 మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించాం. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించాం. భారత్ ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు తలొగ్గదని నిరూపించాం. చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం. శివుడికి, చంద్రుడికి అవినాభావ సంబంధం ఉంది. సోమనాథ్ దేవాలయ సంపదను గజనీ, ఖిల్జీ అనేకసార్లు దోచుకున్నారు. ఎన్ని సార్లు దాడులు చేసినా సోమనాథ్ దేవాలయం సగర్వంగా నిలబడింది. భారత్ ఆధ్యాత్మిక శక్తి గురించి విధ్వంసకారులకు తెలియదు." అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. సోమనాథ్ ఆలయంలో నిర్వహిస్తున్న 'అమృత్ మహోత్సవంలో' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'అభిషేకం', 'ధ్వజ పూజ'తో పాటు 'మహా పూజ'లో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా భారత వాయుసేనకు చెందిన 'సూర్యకిరణ్' టీమ్ నిర్వహించిన సాహసోపేతమైన విన్యాసాలు అబ్బురపరిచాయి. అనంతరం సోమ్ నాథ్ ఆలయ పునర్నిర్మాణానికి నాంది పలికిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో జరిగే కుంభాభిషేక క్రతువులో ప్రధాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వి కూడా పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన భారీ రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సోమనాథ్ వీధులు మోదీ నామస్మరణతో మారుమోగాయి. హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ సర్కిల్ వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర సాగిన ప్రధాని రోడ్‌షోకు జనం భారీగా తరలివచ్చారు. దారిపొడవునా జాతీయ జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ ప్రధానికి ఘనస్వాగతం పలికారు. రోడ్‌షోలో భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. బెంగాల్‌కు చెందిన జానపద కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలతో రోడ్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 1951లో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఈ పునర్నిర్మిత ఆలయాన్ని ప్రారంభించారు. ఆ చారిత్రక ఘట్టానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

## విచారణకు సహకరించండి

**-దోషులు ఎవరైనా చట్టం ముందు తప్పించుకోలేరు**
**-బీసీ అంశాన్ని రాజకీయంగా వాడుకోవడం సరికాదు**
**-తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుంది**
**-బండి సంజయ్ కుమారుడి వ్యవహారంపై మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్**

కేంద్ర సహాయ హోంమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి కక్షపూరిత ధోరణితో వ్యవహరించడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులే ముందుకు వచ్చి విచారణకు సహకరించాలని, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ స్వయంగా తన కుమారుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని కోరాల్సిందని అన్నారు. సానుభూతి కోసం కుట్ర ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. అమ్మాయి తనను కలిసిందా లేదా, ఆమెతో బాబు తిరిగాడా



లేదా వంటి అంశాలపై నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత సంబంధిత వారిపైనే ఉంటుందని వ్యాఖ్యానించారు. చట్టం తన పని తాను చేసుకునేలా సహకరించాలని, తెలంగాణ ప్రభుత్వం ఎవరి పట్ల వివక్ష చూపదని తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డల భద్రత ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. మున్నూరు కాపు సంఘ నాయకులు వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నప్పటికీ, ఈ వ్యవహారాన్ని కులం లేదా రాజకీయ కోణంలో చూడడం సరికాదన్నారు. ఇందులో ఎవరినీ లక్ష్యంగా చేసుకుని బ్లేమ్ గేమ్ ఆడడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా డీజీపీతో మాట్లాడి విచారణకు ఆదేశాలు ఇచ్చారని మంత్రి వెల్లడించారు. మహిళా డీసీపీ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోందని, రాజకీయ ఒత్తిడులకు తావులేకుండా పూర్తిగా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతుందని పేర్కొన్నారు. దోషులు ఎంతటి వారైనా చట్టం ముందు తప్పించుకోలేరని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు నిజంగా జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం వెనకడుగు వేయదని మంత్రి స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచారణను ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తే ప్రజాస్వామ్యం అంగీకరించదన్నారు.

## బండి సంజయ్ బర్తరఫ్ చేయాలి,

-మాజీ జెడ్పీటీసీ తానాజీ రావు



**గాంధారి, మే 11 (మహాప్రభ)**
కేంద్రమంత్రి బండి సంజయ్ వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. గాంధారి మండలం కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోక్సో కేసులో సామాన్యులకు ఒక రూల్, బండి సంజయ్ కుమారుడికి మరో రూల్ ఎలా ఉంటుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటిసి తానాజీ రావు, మాట్లాడుతూ.. బాధితురాలు న్యాయం చేయాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో జీపీవోకు తీవ్రగాయాలు



**గాంధారి, మే 11 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం బూర్గుల్ జీపీవో స్వామికి సోమవారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. గాంధారి నుంచి బూర్గుల్ వెళు తుండగా రోడ్డుపై గేదె అడ్డం రావడంతో గేదెను తప్పించబోయి బైకు స్లిప్ అవడం వల్ల కింద పడడంతో ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

-రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు.
-కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ వరి కొనుగోలు కేంద్రం, సత్య సాయి రైస్ మిల్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా -11మే (మహాప్రభ )**
రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని కొనుగోలుకు సంబంధించిన అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు, అన్లోడింగ్ లో సమస్యలు తలెత్తకుండా మిల్లర్లు సమన్వయంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ కొల్చారం మండల కేంద్రంలోని ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్, కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలు, గన్ని బ్యాగ్ లు సరిపడా పంపిస్తున్నారా లేదా?కేంద్రాలకు కేటాయించిన లారీలు వస్తున్నాయా? లేదా? అలాగే నమోదు అయిన ఓపీఎంఎస్ వివరాల గురించి కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ



సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు 13 లారీల ధాన్యం ఈ సెంటర్ నుండి సత్య సాయి రైస్ మిల్లుకు తరలించడం జరిగిందని ఈ సెంటర్లో హమాలీల కొరత లేదని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సివిల్ సప్లై అధికారులు కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శిస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మదన్ మోహన్ కృషితో పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం

**గాంధారి మే 11 (మహాప్రభ)**
ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్ మోహన్ గాంధారి మండలం తిప్పారం గ్రామంలో ఎమ్మెల్యే కృషితో అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నిజమైంది. ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి లబ్ధిదారులకు నూతన గృహాలను అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులు ఎమ్మెల్యే మదన్ మోహన్, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇంటి కోసం ఎదురుచూసిన తమ కలను సాకారం చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం కోసం ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాజేశ్వర్, తాసిల్దార్ రేణుక చౌహాన్, స్థానిక సర్పంచ్ సోలంకి ప్రమోద మాధవ రావు, ఏఎంసీ చైర్మన్ బండారి పరమేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గారు,మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు బీస గణేష్ గారు ,కాంగ్రెస్ నాయకులు తూర్పు రాజులు గారు, నాగ్లూర్ సర్పంచ్ సంతోష్ , గ్రామ ఉప సర్పంచ్ శ్రవణ్ , వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



## ప్రత్యేకంగా విద్యార్థులకు వేసవి సెలవులో తరగతులు ప్రారంభం

-సర్పంచ్ మామ్మాయి రేణుక సంజీవ్ యాదవ్
-విద్యా విద్యాధికారి శ్రీహరి




**గాంధారి మే 11 (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులను విద్యార్థులకు 99 రోజుల భాగంగా విద్య- ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక ను చేపట్టినటువంటి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినీ విద్యార్థులకు విద్యను సద్వినియోగపరుచుకునేలా ఏర్పాటు చేసిన మండల స్థాయి సమ్మర్ క్యాంప్ తరగతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాంధారిలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్, మాట్లాడుతూ.. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడం మరియు వివిధ నైపుణ్యాల అభివృద్ధి కొరకు ఏర్పాటు చేసిన ఈ క్యాంపును మండలంలోని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీహరి, మాట్లాడుతూ.. వివిధ రకాల కళాకృతుల తయారీ, చిత్రలేఖనం, అబాకస్ శిక్షణతో పాటు ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకునేలా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు ఉంటాయని తెలిపారు.ఈ తరగతుల కొరకు ప్రభుత్వం అందించిన వస్తువులను ప్రధానోపాధ్యాయురాలు సుజాత, విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో గండివేట్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శారద, ఉపాధ్యాయ బృందం రాజా పండిత్ ,మల్లేష్ , రాధాదేవి, చక్రధర్, శంకర్ గౌడ్ , శ్రీనివాస్, సాయిలు ఇబ్రహీం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కుమ్మర సంఘం జిల్లా కమిటీ సమావేశం ఘనంగా నిర్వహణ.

**కర్మంఘాట్ 11 మే (మహాప్రభ)**
రంగారెడ్డి జిల్లా కుమ్మర సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆనంద్ బంక్వ్యాట్ ఫంక్షన్ హాల్, గాయత్రీ నగర్ 'శ' రోడ్, కర్మాంగాట్, హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కే ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభను అధ్యక్షులు ఏగిరిశెట్టి వీరన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శంకరయ్య, జిల్లా కోశాధికారి కాసులు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకొండ రాములు, యువత విభాగం జిల్లా అధ్యక్షులు ఆడలా గణేష్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు కొండాపురం శ్రవణ్ కుమార్, ఎల్ బీ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు నడికుడ అశోక్, జిల్లా ప్రచార కార్యదర్శి ఎగిరిశెట్టి బాల్‌రాజ్, వృత్తి విభాగం నాయకులు మల్కాజ్గిరి సుభాష్, సంఘ నాయకులు మల్కాజ్గిరి యాదయ్య, జపాల లడ్డు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించి మట్టి పాత్రలను వినియోగించాలని సూచించారు.




పర్యావరణ పరిరక్షణలో కుమ్మర వృత్తికి విశేష ప్రాధాన్యత ఉందని తెలిపారు. కుమ్మరుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, పూర్తి స్థాయి పాలకవర్గాన్ని నియమించి, రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించి కుమ్మర వృత్తిదారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, తేది 17-05-2026 ఆదివారం ఉదయం 10 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కె ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు నాయకత్వంలో 33 జిల్లాల కార్యవర్గాల సమావేశం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, సంఘ నాయకులు అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

## శివంపేట మండలంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు పంపిణీ....

-ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి...






**శివంపేట, మే 11 (మహాప్రభ):**
శివంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల ఇందిరమ్మ ఇల్లు 83 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మండల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు లబ్ధిదారుల సమక్షంలో మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత నాది అని అన్నారు. ప్రభుత్వ అధికారుల నిబంధన మేరకే ఇంటిని నిర్మించుకోవాలని లేనిపక్షంలో బిల్లులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివంపేట మండల పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, హౌసింగ్ డిఈ ప్రభు, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, శివంపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజా రమణ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, స్థానిక శివంపేట సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న గోలీ దంపతులు

**ఆమనగల్లు, 11 మే (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఆయన ధర్మపత్ని సుమలతతో కలిసి సోమవారం కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.. లోకకళ్యాణం కోసం, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం మరియు కల్వకుర్తి నియోజకవర్గం ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు. దర్శనానంతరం ఆలయ పండితులు రంగనాయకుల మండపంలో వీరికి వేదాశీర్వచనం చేయగా, అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.



## కొల్లాపూర్‌లో జనగణన తొలి దశ ప్రారంభం

**కొల్లాపూర్, మే 11( మహా ప్రభ)**
కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో జనగణన తొలి దశ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రెడ్డి జ్యోతి సత్యం హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ కార్యక్రమాలను ప్రారంభించారు.అధికారులు మాట్లాడుతూ, "జనగణన ప్రక్రియను డిజిటల్ విధానంలో నిర్వహిస్తూ, ప్రజలకు స్వీయ గణన సౌకర్యం కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. సమగ్ర, ఖచ్చితమైన సమాచారం సేకరణకు ప్రజల సహకారం అత్యవసరం" అని తెలిపారు.జనగణన విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# కొత్తపల్లి సొసైటీ పాలక మండలి బాధ్యతల స్వీకరణ




**పాపన్నపేట,మే, 11( మహా ప్రభ )**
మండల పరిధిలోని కొత్తపల్లి రైతు సేవా సహకార బ్యాంకు పాలక మండలి సభ్యులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార బ్యాంకుల పాలకవర్గాలకు మరో ఆరు నెలల పాటు పదవీకాలాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని పాలక మండలి చైర్మన్ మరియు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ త్యార్ల రమేష్ గుప్త మాట్లాడుతూ కొత్తపల్లి సహకార బ్యాంకు రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. గడిచిన ఆరేళ్లలో కొత్తపల్లి సొసైటీని ముందు వరుసలో ఉంచామన్నారు. రైతుల శ్రేయస్సుకోసం పాలక మండలి విశేషంగా కృషి చేస్తుందని గుర్తు చేశారు. కొత్తపల్లి సొసైటీ పరిధిలో వినియోగదారుల పెట్రోల్ పంపులు డీలర్ పంపుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. త్వరలో సిఎన్జి, ఎలక్ట్రిక్ వాహనాలకు రీఛార్జి పాయింట్లు అందుబాటులోకి తెస్తామన్నారు. పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మరింత బాధ్యతతో పనిచేస్తామని తెలిపారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పాలకమండలి రైతులకు మేలు చేసే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మల్లప్ప, మండల నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, కొత్తూరి శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, నర్సింలు గుప్తా, ప్రసాద్ రావు, సొసైటీ సీఈఓ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు, సిబ్బంది, సంఘ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం మహిళల ఆర్థిక సాధికారత

- కమలాక్షి రాజన్



**కూకట్పల్లి, మే 11( మహ ప్రభ)**
మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, పార్టీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు కల్పిస్తూ తగిన విధంగా పదవులు ఇవ్వడం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కమలాక్షి రాజన్ తెలిపారు. మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కూకట్పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో జిల్లా మహిళా నాయకులు, కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మహిళా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, రేషన్ కార్డులు, పెన్షన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తనయుడు సాయి భగీరథపై కేసు నమోదైన నేపథ్యంలో నైతిక బాధ్యతగా బండి సంజయ్ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని బండి రమేష్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణలత, మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీత మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలను హనుమంత రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పుష్పారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## హైదరాబాద్ లో నిన్నటి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జనగ్రహ సభ గురించి రివ్యూ మీటింగ్.



**మెదక్ జిల్లా -11మే (మహాసభ )**
భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో నిన్నటి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జనగ్రహ సభ గురించి రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ నిన్న జరిగినటువంటి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జనగ్రహ సభకు మెదక్ జిల్లా శాఖ తరపున 90 పైచిలుకు బస్సులు బయలుదేరి విజయవంతం చేయడం సంతోషకరం. బెంగాల్ లో విజయం సాధించిన ప్రకారమే తెలంగాణ రాష్ట్రంలో కూడా తప్పనిసరిగా బీజేపీ జెండాను ఎగరవేయబోతున్నామని చెప్పడం జరిగింది.అదేవిధంగా నరేంద్ర మోదీ యుద్ధాల కారణంగా చమురు మరియు విదేశీ ఎగుమతుల సమస్యల కారణంగా ముందస్తు చర్యలుగా 10 విషయాలు తెలియజేయడం జరిగింది. పెట్రోల్ డీజిల్ వాడకం తగ్గించాలి ఎలెక్ట్రిక్ వెహికలను ప్రోస్తహించాలి. విదేశీ పర్యటనలను తగ్గించడం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలి.వంటి విషయాల పై దృష్టి పెట్టాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ జిల్లా కార్యదర్శి నాగరాజు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ జిల్లా నాయకులు లోకేష్ మధు మల్లేశం పాపన్నపేట మండల అధ్యక్షులు సంతోష్ చారి బీజేపీ నాయకులు విక్రమ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించిన దొడ్లే లహరి....




**శివంపేట,మే 11 (మహాప్రభ)**
నర్సాపూర్ పట్టణంలోని శ్రీ వాత్సల్య గురుకుల విద్యాలయంలో చదువుతున్న శివంపేట మండల కేంద్రానికి చెందిన దొడ్లే సంతోష- సంతోష్ దంపతుల కూతురు దొడ్ల లహరి హైదరాబాద్ లో జరిగిన స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్స్ సాధించింది. గత నెలలో జిల్లా స్థాయిలో ఎంపికై ఆదివారం జరిగిన స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల స్కూల్ ప్రిన్సిపల్, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా దొడ్ల లహరి మాట్లాడుతూ నా విజయానికి ప్రోత్సహించిన నాగరాజు మాస్టర్,శేఖర్ మాస్టర్, సిద్ధార్థ మాస్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలియజేసింది.


## హావెలి ఘణపూర్ లో ఘనంగా పోచమ్మ అమ్మవారి వార్షికోత్సవం.

-శ్రీ పోచమ్మ అమ్మవారి వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా -11మే (మహాప్రభ )**
హవేలీఘన్పూర్ మండలంలోని శ్రీ పోచమ్మ అమ్మవారి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ పోచమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడంలో ఇలాంటి ఉత్సవాలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని కోరుకురన్నారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల సాయిలు, నాయకులు రామచంద్రారెడ్డి, శంకరంపేట్ ఆర్ మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి. రాజు సీనియర్ నాయకుల లక్ష్మారెడ్డి,మల్లుపల్లి సర్పంచ్ ఇమ్మడి నరేష్, హవెలిఘనపూర్ గ్రామ పెద్దలు వెంకట్ రెడ్డి, కుర్మ పోచయ్య, గుండ.సత్యనారాయణ, శ్రీపాల్,నల్ల లక్ష్మీనారాయణ, నోముల శ్రీకాంత్, కమ్మరి ఆంజనేయులు, దొమ్మాట రవీందర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ డివిజన్ మే 10 (మహాప్రభ )**
చందంపేట మండలం పోల్య నాయక్ తండాలో జరిగిన కుమార్ – నందిని ల వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు యాసాని రాజవర్ధన్ రెడ్డి,సర్పంచులు ఇస్లావత్ వెంకట్రామ్, ఇస్లావత్ గోపాల్, మాజీ ఎంపీటీసీ బలవద్ది రాజ్,శ్రీను తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటరాక్టివ్ డిజిటల్ బోర్డు ప్రారంభం




**శివంపేట, మే 11 (మహాప్రభ):**
శివ్వంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆధునిక ఇంటరాక్టివ్ డిజిటల్ బోర్డును శివ్వంపేట సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ డిజిటల్ బోర్డు ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.వి. శైలజ, కళాశాల సిబ్బంది, గ్రామ పంచాయతీ సభ్యులు కామల్యగారి మల్లేశ్వరి నర్సింలు, ముయ్యడ్డి ముత్యాలు, పెద్దకొల్ల విక్రం, మాజీ వార్డు సభ్యులు ముయ్యడ్డి సింహం, పైనం సందీప్, కోడలి యాదగిరి మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## 18న ఉచిత కంటి వైద్య శిబిరం

**ఆమనగల్లు, మే 11 (మహాప్రభ):**
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ ఎం.ఏ పాష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ లేదా రేషన్ కార్డుతమ వెంట తెచ్చుకోవాలని పాషా సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

--జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -11మే (మహాప్రభ )**
ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలలనుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.
ఈ రోజు మొత్తం 67దరఖాస్తుల స్వీకరించారు. అందులో భూ భారతి 17 ,పెన్షన్ 10, హౌసింగ్ 6,ఇతర 36 మొత్తం 67 వచ్చిన దరఖాస్తు పరిష్కరించి ఫిర్యాదు దారులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పిసిఓ ఎల్లయ్య, డిఆర్ఓ శ్రీనివాసరావు, డి ఆర్ ఓ అంబదాసు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## "ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి"


-కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి



**శివంపేట మే 11 (మాహప్రభ):**
నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి, సామాజిక మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నర్సాపూర్, శివ్వంపేట, కొత్తపల్లి, రామయపల్లి, శెట్టిపల్లి కాలాన్, కాగజ్ మద్దూరు గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరైన ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వెల్దుర్తి మండలం ఎదులపల్లి గ్రామంలో ఇటీవల వివాహం చేసుకున్న నూతన వధూవరులను కలిసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో నిర్వహించిన శ్రీ బీరప్ప జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, చింతల వెంకటరామిరెడ్డి, మాధవరెడ్డి, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సంచలనం రేపిన పోక్సో కేసు

-- ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి



**కూకట్పల్లి ,మే 11( మహ ప్రభ)**
హైదరాబాద్: తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన పోక్సో కేసులో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసు దర్యాప్తును వేగవంతం చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటి)ను ఏర్పాటు చేసింది. మైనర్‌కు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడంతో పోలీసులు పోక్సో లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు సున్నితమైనదిగా భావించిన , విచారణ పారదర్శకంగా మరియు వేగంగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. కూకట్‌పల్లి డీసీపీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. ఈ బృందంలో అనుభవజ్ఞులైన పోలీసు అధికారులు, సాంకేతిక నిపుణులు, మహిళా అధికారులను కూడా చేర్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. దర్యాప్తు భాగంగా బాధితురాలి వాంగ్మూలం, డిజిటల్ ఆధారాలు, కాల్ రికార్డులు మరియు ఇతర సాక్ష్యాలను పోలీసులు సేకరిస్తున్నారు. కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని చట్టపరమైన విధానాల ప్రకారం పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఈ వ్యవహారం రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతిపక్ష, అధికార పార్టీ నేతల మధ్య ఆరోపణలు-ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. అయితే, దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎవరికైనా సంబంధించిన ఆరోపణలు నిర్ధారణ కాలేదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగిస్తుండగా, తదుపరి పరిణామాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# ప్రధాని వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి

-కాంగ్రెస్ నేత డా. పి. నాగిరెడ్డి విమర్శలు



**కూకట్‌పల్లి, మే 11(మహ ప్రభ)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఆయన హోదాకు తగనివిగా ఉన్నాయని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ 'ఏ' బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కోసం కేంద్ర నిధులు కోరుతున్న సమయంలో ప్రధాని రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని నాగిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిని పార్టీ మారమంటూ మాట్లాడటం ప్రధాని స్థాయికి తగదని విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు అడిగితే చిల్లర రాజకీయాలు చేయడం దేశ ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎవరికీ తలవంచదని, స్వాభిమానంతో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పదవీకాలాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ఆయన హయాంలో రాష్ట్రాల అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూసారని నాగిరెడ్డి అన్నారు. ఆ సమయంలో గుజరాత్ రాష్ట్రానికి కేంద్రం నుంచి భారీగా నిధులు అందాయని, వాటితోనే నేడు గుజరాత్ మోడల్ గురించి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.ప్రధాని చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు నాగిరెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ లో స్నానానికి వెళ్లి యువకుడు మృతి.



**దేవరకొండ డివిజన్ మే 11 ( మహాప్రభ )**
నేరేడు గొమ్ము మండలం వైజాగ్ కాలనీ సమీపంలోని నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. భువనగిరి నుండి నలుగురు యువకులు వైజాగ్ కాలనీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి సందర్శించేందుకు వచ్చారు. వీరిలో ముగ్గురు స్నానం కోసం నీటిలో దిగారు. పల్లెర్ల గ్రామానికి చెందిన వంగపల్లి గిరిబాబు (27) ఈత రాకపోవడంతో తమతో వచ్చిన ముగ్గురి కి కొంత దూరంగా ఒడ్డున స్నానం చేస్తున్నాడు. ఈ క్రమంలో స్నానం చేసే వద్ద దరికూలి నీటిలో పడిపోవడంతో లోతులోకి వెళ్లి మునిగిపోయాడు. దీంతో అక్కడున్న స్నేహితులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న నేరేడు గొమ్ము ఎస్ ఐ కె. నాగేంద్రబాబు పోలీసు సిబ్బందితో కలిసి వెంటనే ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం యువకుడికి మృతదేహాన్ని నీటి నుంచి వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.**
**-ఏ నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి**
**-వీవీఐపీ ,వీఐపీ, ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి.**



**మెదక్ జిల్లా -11మే (మహాప్రభ )**
ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, ఏ నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు.ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రముఖుల పేర్లు మిస్ అయ్యాయనే సంచలన వార్తలు రాకుండా చూడాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూలి మెదక్ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్‌ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి నియమిస్తున్నామని, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డిఓ రమాదేవి తాహాసిల్దారులు ,ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేవరకొండ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం. రామదుర్గారెడ్డిని కలిసిన జర్నలిస్టులు



**దేవరకొండ డివిజన్ మే 11 ( మహాప్రభ )**
దేవరకొండ మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం. రామదుర్గారెడ్డి స్థానిక జర్నలిస్టుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రజా సమస్యలపై జర్నలిస్టులు కమిషనర్‌తో చర్చించారు.

**జర్నలిస్టులు ప్రస్తావించిన ముఖ్యాంశాలు:**

**పట్టణ సుందరీకరణ:** దేవరకొండ పట్టణాన్ని స్వచ్ఛంగా, అందంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కోరారు.

మౌలిక సదుపాయాలు: పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు, తాగునీటి సరఫరా మరియు వీధి దీపాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విన్నవించారు.

**ప్రజా సమస్యలపై స్పందన:** వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పుడు సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు.

సమన్వయం: పట్టణ అభివృద్ధిలో మీడియా ప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని, నిరంతరం ప్రజలకు, మున్సిపాలిటీకి మధ్య వారధిలా ఉంటామని ఈ సందర్భంగా జర్నలిస్టులు పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ...జర్నలిస్టుల విజ్ఞప్తిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. పట్టణ సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, అందరి సహకారంతో దేవరకొండను ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తానని భరోసా ఇచ్చారు. పారదర్శకమైన పాలన అందిస్తానని, ఎప్పటికప్పుడు మీడియా సూచనలను స్వీకరిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకురి వెంకటయ్య ( ప్రజా గర్జన రిపోర్టర్),ముసిని అంజన్ ( నీలగిరి వార్త రిపోర్టర్), పులిజాల గోవర్ధన్ ( పోలీస్ నిఘా రిపోర్టర్), చనగాని శ్రీనివాస్ గౌడ్( మహాప్రభ రిపోర్టర్),మున్సిపల్ సిబ్బంది రవి, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వినతులు స్వీకరించిన ఎస్పీ.

-బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల లక్ష్యం : ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్.



**మెదక్ జిల్లా -11మే (మహాప్రభ ).**
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్‌కు వినిపించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలు తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సీఐలు, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫిర్యాదులపై సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి వేగంగా స్పందించాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఎస్పీ తెలిపారు. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. చట్ట ప్రకారం ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం అందిస్తామని పేర్కొన్నారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయని, ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరుగుతోందని ఎస్పీ తెలిపారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం....

**శివంపేట,మే 11 (మహాప్రభ):**
శివంపేట మండల కేంద్రంలో గల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో 15 రోజులు (11-5-2026 నుండి 25-5-2026) వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ క్యాంపు ను ఈ రోజు శివంపేట ఎంఈఓ బుచ్చా నాయక్ ప్రారంభమించినారు.ఈ కార్యక్రమం లో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రసాద్ సార్, చంద్రమోహన్ పాల్గొన్నారు. విద్యార్థులు 40 మంది మొదటి రోజు రావడం జరిగింది.ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపు 15 రోజుల ప్రోగ్రామ్ లో విద్యార్థులకు ఉపయోగకరమైన ఇండోర్ గేమ్స్ డాన్స్,యోగ, మోరల్ వాల్యూస్ గురించి శిక్షణ ఉండును.కావున విద్యార్థులు ఉపయోగించు కోవాలని ఎంఈఓ ఈ సందర్భముగా చెప్పడం జరిగింది.







# మానవత్వం చాటిన కృష్ణ కాంత్...

**శివ్వంపేట,మే,11 (మహాప్రభ):**
అనంతపురం జిల్లా గుంతకల్లు మండలానికి చెందిన టిప్పు సుల్తాన్ అనే వ్యక్తి కూతురు పెండ్లి నిమిత్తం ఒక షాప్ లో సరుకులు కొనుగోలు చేసి వాటికీ అయినా మొత్తం 40,000 (నలభై వేలు) వేల రూపాయలను చరవాణి ధ్వారా పంపగా ఒక్క నంబర్ తప్పు పడి మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగాయిపల్లి కి చెందిన పెద్ద దాసరి కృష్ణ కాంత్ ఖాతాలో జమ కాగా గుంతకల్లు కు చెందిన టిప్పు సుల్తాన్ చర వాణి ధ్వారా కృష్ణ కాంత్ ను సంప్రదించగా తిప్పు సుల్తాన్ కు తిరిగి 40,000 వేల రూపాయలను పంపగా టిప్పు సుల్తాన్ కుటుంబం ఆనందంతో కృష్ణ కాంత్ కు కృతజ్ఞతలు తెలిపారు.





# బిజినెస్

## భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు



పశ్చిమాసియా లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్ల ను కుదిపేశాయి. ప్రపంచ వృద్ధి, ద్రవ్యోల్బణంపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1312.91 పాయింట్లు నష్టపోయి 76,015.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 360.3 పాయింట్లు పతనమై 23,815.85 వద్ద ముగిసింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సుదీర్ఘకాలం కొనసాగుతాయనే భయాలు, బలహీన అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి.పశ్చిమాసియాలో ఇంకా తెరపడని ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని, ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఆందోళనలతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ముఖ్యంగా నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ ఏకంగా 4 శాతం పతనమైంది. రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్, మీడియా రంగాల షేర్లు కూడా భారీగా నష్టపోయాయి. మరోవైపు ఎఫ్ఎంసీజీ, ఫార్మా, హెల్త్‌కేర్ వంటి రక్షణాత్మక రంగాల షేర్లు కొంతవరకు నిలదొక్కుకున్నాయి. నిఫ్టీలో టైటాన్ కంపెనీ, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టపోగా.. కోల్ ఇండియా, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్ లాభపడ్డాయి. కాగా మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడాలంటే నిఫ్టీ 24,000 స్థాయిని దాటాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. ఇదే సమయంలో భారత రూపాయి విలువ కూడా డాలర్‌తో పోలిస్తే రికార్డు కనిష్ఠస్థాయి (రూ.95.80) కి పడిపోవడం మార్కెట్‌పై అదనపు ఒత్తిడిని పెంచిందని అంటున్నారు.

## పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్.. మరోసారి దిగొచ్చిన బంగారం, వెండి ధరలు.. తులం ఎంతంటే?

గత కొన్ని నెలలుగా అంతర్జాతీయంగా నెలకొన్ని ఉద్రిక్తలు, డాలర్ విలువ మారకంతో బంగారం, వెండి ధరలో భారీ హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయి. ఒకానోక సమయంలో తులం బంగారం ధర ఏకంగా రూ.2లక్షలకు చేరువలోకి వెళ్లగా వెండి ధర రూ.4లక్షలకు దగ్గరగా వెళ్లి సమాన్యులకు అందని ద్రాక్షలా మారింది. కానీ తర్వాత నెలకొన్న పరిస్థితుల కారణంగా ఈ రెండు ఆభరణాల ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టి ప్రస్తుతం కొనుగోలుదారులకు ఊరట కల్పిస్తున్నాయి. తాజాగా మరోసారి బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఔన్స్ కు $4,715 గా ఉంది.

ఇక మన దేశీయ మార్కెట్‌లో చూసుకుంటే ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,234గా ఉండగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,39,640 వద్ద ట్రేడవుతుంది. ఇక వెండి కూడా బంగారం బాటలోనే నడుస్తోంది. బంగారం తగ్గిన ప్రతిసారి వెండి కూడా తగ్గుతూ వస్తుంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో కేజీ వెండి ధర



రూ.2,74,900 వద్ద ట్రేడవుతుంది.

**ఇక దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.**

హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,52,234గా ఉండగా నిన్న ఈ ధర 1,52,650 గా ఉంది. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,640 ఉంది. వెండి కిలో ధర రూ.2,62,350గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,52,234, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,640 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,52,234, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,640 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,234, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,640 ఉంది.

కోల్‌కత్తాలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,234, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,640 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,360,గా ఉండగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,490గా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,52,490, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ1,39,790 వద్ద కొనసాగుతుంది.ఇక వెండి ధరలు చూసుకుంటే దేశీ మార్కెట్‌లో కేజీ వెడి ధర రూ.రూ.2,74,900 గా ఉండగా హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.279,900 గా ఉంది

## కరిగిపోతోన్న భారత ఫారెక్స్ నిల్వలు

**-వారంలో 7.79 బిలియన్ డాలర్లు తగ్గుదల**

**ముంబయి**

భారత విదేశీ మారకం నిల్వలు భారీగా తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది మే 1తో ముగిసిన వారానికి ఫారెక్స్ నిల్వలు 7.794 బిలియన్ డాలర్లు తగ్గి 690.693 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. అంతకుముందు వారం కూడా ఈ నిల్వలు 4.82 బిలియన్ డాలర్ల మేర క్షీణించాయి. ఇంత్రకితం 2026 ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో విదేశీ మారకద్రవ్య నిల్వలు 728.494 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ రికార్డు స్థాయిని తాకాయి. ఆ తర్వాత



అమెరికా సామ్రాజ్యవాద విధానాలతో పశ్చిమాసియాలో తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత రూపాయిపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. రూపాయి విలువ పడిపోకుండా నియంత్రించేందుకు ఆర్‌బిఐ జోక్యం చేసుకుని డాలర్లను విక్రయించడంతో నిల్వలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి.?ఆర్‌బిఐ తాజా నివేదిక ప్రకారం.. విదేశీ మారక నిల్వల్లో అతిపెద్ద భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సిఎ) 2.797 బిలియన్ డాలర్లు తగ్గి 551.825 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం నిల్వలు కూడా 5.021 బిలియన్ డాలర్ల భారీ తగ్గుదలతో 115.216 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. మరోవైపు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద ఉండే స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ స్వల్పంగా 15 మిలియన్ డాలర్లు పెరిగి 18.789 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

# స్పోర్ట్స్

## ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా గుడ్ బై..?

ముంబై ఇండియన్స్‌లో ఏం జరుగుతోంది..? కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిజంగానే గాయపడ్డాడా..? లేదా కావాలనే గత రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడా..? మేనేజ్‌మెంట్‌తో విభేదాల రావడంతో టీమ్‌ను వీడాలని నిర్ణయించుకున్నాడా..? ఈ ప్రశ్నలకు బలాన్ని చేకూర్చేలా ముంబై ఇండియన్స్ అకౌంట్‌ను అన్‌ఫాలో చేసి.. కొన్ని గంటల తర్వాత మళ్లీ ఫాలో చేయడం చర్చనీయాంశంగా మారింది. తన సోషల్ మీడియా ఖాతాల్లో ముంబై ఇండియన్స్‌కు చెందిన పోస్టులను మొత్తం డిలీట్ చేశాడు. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరిన ముంబై.. ఈసారి దారుణమైన ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో కింది నుంచి రెండోస్థానంలో ఉంది. ఆడిన 11 మ్యాచ్‌ల్లో కేవలం మూడు విజయాలు మాత్రమే సాధించింది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా తప్పుకుంది. మొదటి మ్యాచ్‌ను విజయంతో ఆరంభించినా.. ఆ తరువాత టీమ్ పూర్తిగా గాడి తప్పింది. రోహిత్ శర్మ గాయం కారణంగా నాలుగు మ్యాచ్‌లు దూరం కావడం.. బుమ్రా వికెట్లు తీయకపోవడం.. సూర్యకుమార్ యాదవ్ పూర్ ఫామ్‌లో ఉండడం.. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలో పాండ్యా విఫలమవ్వడం.. జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపించింది. ఈ సీజన్‌లో పాండ్యా మూడు మ్యాచ్‌ల్లో ఆడలేదు. పాండ్యా స్థానంలో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఈ



నేపథ్యంలోనే సోషల్ మీడియాలో పాండ్యాపై వార్తలు మొదలయ్యాయి. వచ్చే సీజన్‌కు పాండ్యా మరో జట్టులోకి వెళతాడని ప్రచారం మొదలుపెట్టారు. తన మాజీ టీమ్ గుజరాత్ టైటాన్స్‌లోకి మళ్లీ వెళ్లిపోతాడని రూమర్లు అంటూ స్టార్ చేశారు. హెడ్ ఆశిష్ నెహ్రాకు కాల్ చేసి.. 'నెహ్రా.. జీ నేను వచ్చేస్తున్నా..' అన్నాడని ట్రోల్స్ చేస్తున్నారు. హార్దిక్ పాండ్యా గాయంపై ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేల జయవర్ధనే కీలకమైన అప్‌డేట్ ఇచ్చారు. పాండ్యా వెన్నునొప్పి సమస్యతో బాధపడుతున్నాడని.. వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడని వెల్లడించారు. అతని ఫిట్‌నెస్ విషయంలో జట్టు యాజమాన్యం ఎలాంటి రిస్క్ తీసుకోవాలనుకోలేదని.. అందుకే ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌కు అతనికి విశ్రాంతినిచ్చినట్లు తెలిపారు. అతని పరిస్థితిని బట్టి వచ్చే మ్యాచ్‌కు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.


## గోల్డెన్ డకౌట్లలో ముందు వరుసలో కోహ్లీ



ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. ఆడిన తొలి బంతికే కోహ్లీ పెవిలియన్‌కు చేరుకున్నాడు. దీపక్ చాహర్ బౌలింగ్‌లో రాజ్ బవా క్యాచ్ అందుకోవడంతో ఔట్ అయ్యాడు. దీంతో విరాట్ కోహ్లీ నిరాశగా పెవిలియన్ బాట పట్టాడు. ఐపీఎల్ చరిత్రలో కోహ్లీకి ఇది 12 డకౌట్ కాగా.. 8వ గోల్డెన్ డకౌట్ కావడం గమనార్హం. ఇక ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు గోల్డెన్ డకౌట్ అయిన జాబితాలో కోహ్లీ మూడవ స్థానంలో నిలిచాడు. ఇక ఈ జాబితాలో రషీద్ ఖాన్ ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నాడు. అతడు 12 సార్లు గోల్డెన్ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరుకున్నాడు. ఆ తరువాత గ్లెన్ మాక్స్‌వెల్ ఉన్నాడు. అతడు 10 సార్లు గోల్డెన్ డకౌట్ అయ్యాడు.అయితే 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో రన్ మెషిన్ విరాట్ కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్లు కావడం ఇది రెండో సారి మాత్రమే. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లోనూ కోహ్లీ రెండు బంతులకు డకౌట్ అయ్యాడు. అంతకముందు 2022 ఐపీఎల్ సీజన్‌లో లక్నో, సన్ రైజర్స్ పై వరుస మ్యాచ్‌ల్లో కోహ్లీ డకౌట్లు అయ్యాడు.

## ఐపీఎల్ 2026 నుండి ముంబై ఔట్

ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించింది. చివరి బంతి వరకు టెన్షన్.. టెన్షన్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో ఆర్సీబీనే విక్టరీ కొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై 7 వికెట్ల నష్టానికి 166 పరుగులే చేసింది. 167 రన్స్ టార్గెట్‌ను ఆర్సీబీ చివరి బంతికి చేజ్ చేసింది. ఆర్సీబీ బ్యాటర్లలో కృనాల్ పాండ్యా హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఓ ఎండ్‌లో వికెట్లు పడినా కృనాల్ పాండ్యా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 46 బంతుల్లోనే 73 రన్స్ చేసి.. తిలక్ వర్మ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. 2 వికెట్ల తేడాతో ఆర్సీబీ గెలుపొందింది. ఈ గెలుపుతో పాయింట్స్ టేబుల్‌లో టాప్‌కి దూసుకెళ్లింది బెంగళూరు. ఈ మ్యాచ్‌లో ఓటమితో టోర్నీ నుంచి ముంబై ఇండియన్స్ నిష్క్రమించింది. ఇక 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి



దిగిన బెంగళూరుకి కూడా ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. పేసర్ దీపక్ చాహర్ నిప్పులు చెరిగే బంతులతో విరాట్ కోహ్లీని డకౌట్ చేశాడు. కోహ్లీ వరుసగా రెండో మ్యాచ్‌ల్లోనూ సున్నాకే వెనుదిరగడం ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. పవర్‌ప్లే ముగిసేసరికి పడిక్కల్, కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్లను కూడా కోల్పోయి ఆర్సీబీ కష్టాల్లో పడింది. ఆ సమయంలో కృనాల్ పాండ్యా, యువ ఆటగాడు జాకబ్ బెథెల్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కృనాల్ కేవలం 32 బంతుల్లోనే మెరుపు అర్ధసెంచరీ సాధించి మ్యాచ్‌ను ఆర్సీబీ వైపు తిప్పాడు. చివర్లో జితేష్ శర్మ ఆఖరి బంతికి కావాల్సిన పరుగును సాధించి ఆర్సీబీ సంచలన విజయాన్ని నమోదు చేశాడు.

ఈ విజయంతో ఆర్సీబీ 11 మ్యాచ్‌లలో 7 విజయాలు, 4 ఓటములతో 14 పాయింట్లు సాధించి రన్ రేట్ ०1.103తో టేబుల్‌లో టాప్‌కి దూసుకెళ్లింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్‌కి కూడా 14 పాయింట్లు ఉన్నాయి కానీ ఆర్సీబీ ముందంజలో ఉంది. ఇక ముంబై ఇండియన్స్ 10 మ్యాచ్‌లలో సుమార్ 6 పాయింట్లు మాత్రమే సాధించి ప్లేఆఫ్స్ ఆశలను కోల్పోయింది.



గ్లామర్ లుక్ లో మీనాక్షి ఫోజులు..

# వారణాసికి బయలుదేరుదాం

## హీరోయిన్ ప్రియాంక ఆసక్తిక పోస్ట్



ఎస్ఎస్ రాజమౌళి -మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్విరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీ అప్‌డేట్‌ను ప్రియాంకా చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంది. జర్నీలో ఉన్న ప్రియాంకా చోప్రా 'వారణాసి బయలుదేరుదాం'అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. తాజా పోస్ట్‌తో ప్రియాంకా చోప్రా వారణాసి తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయినట్టు అర్థమవుతోంది. షూటింగ్‌కు అవసరమైన నీటి కొరత కారణంగా ఇటీవలే వారణాసి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకా చోప్రా పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027 లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైనదే

## నటి త్రిష ఆసక్తికర పోస్ట్



ఫిల్మ్ స్టార్ త్రిష తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష సోమవారం తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెహ్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాషన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది.

# నా ఫేవరేట్ హీరో ఆయనే..

టాలీవుడ్ సెన్సేషనల్ హిట్ 'బేబి' సినిమాతో రాత్రికి రాత్రే స్టార్ హీరోయిన్‌గా మారిపోయిన వైష్ణవి చైతన్య గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. యూట్యూబ్ స్టార్‌గా కెరీర్ ఆరంభించి, వెండితెరపై తన నటనతో అందరినీ మంత్రముగ్ధులను చేసిన ఈ తెలుగమ్మాయి, తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన మనసులోని మాటను బయటపెట్టింది. టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనిపై తనకున్న క్రష్ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వైష్ణవి చైతన్య తనకి ఇష్టమైన హీరోల గురించి మాట్లాడుతూ, రామ్ పోతినేని పేరును ప్రస్తావించింది.రామ్ అంటే తనకు చిన్నప్పటి నుంచి చాలా ఇష్టమని, ఆయన ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ తనకు ఎంతో నచ్చుతాయని తెలిపింది. ఒక రకంగా రామ్ తనకి "క్రష్" అని ఆమె ఓపెన్‌గా ఒప్పేసుకోవడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రామ్ సినిమాలన్నీ తాను క్రమం తప్పకుండా చూస్తానని, ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే అస్సలు వదులుకోనని వైష్ణవి పేర్కొంది. సాధారణంగా హీరోయిన్లు తమ క్రష్ గురించి బయటపడటానికి కొంచెం సంకోచిస్తుంటారు, కానీ వైష్ణవి చాలా స్పష్టంగా, నిక్కచ్చిగా తన అభిప్రాయాన్ని చెప్పడం విశేషం.ఈ వార్త తెలిసిన రామ్ అభిమానులు "రామ్ - వైష్ణవి కాంబినేషన్‌లో సినిమా వస్తే బాగుంటుంది" అని సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. వీరిద్దరి మధ్య ఉండే ఎనర్జీ లెవెల్స్ స్క్రీన్ మీద అద్భుతంగా ఉంటాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. 'బేబి' సినిమా విజయం తర్వాత వైష్ణవికి వరుస అవకాశాలు తలుపు తడుతున్నాయి. ప్రస్తుతం ఆమె ఆనంద్ దేవరకొండతో మరోసారి నటిస్తున్న సంగతి తెలిసిందే. తన సహజ సిద్ధమైన నటనతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన వైష్ణవి, రాబోయే రోజుల్లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగే అవకాశం ఉందని టాక్.మొత్తానికి తన ఫేవరెట్ హీరోపై వైష్ణవి చైతన్య చూపించిన ఈ అభిమానం ఇప్పుడు టాలీవుడ్ సర్కిల్స్‌లో చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో ఈ "క్రష్" కాంబినేషన్ వెండితెరపై మెరుస్తుందేమో వేచి చూడాలి. 'బేబి' సినిమాతో ఆమె సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. వైష్ణవి పుట్టి పెరిగింది అంతా హైదరాబాద్‌లోని పాతబస్తీలోనే. ఆమె ఒక మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చింది. సినిమాల్లోకి రాకముందు వైష్ణవి సోషల్ మీడియాలో, ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌ల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది.



# ఆ తరహా సినిమాలకు ఇక దూరం?



అగ్రనటి సమంత రూత్‌ప్రభు రూట్ మార్చారు. ఇన్నాళ్లూ స్టార్ హీరోల పక్కన ఆడిపాడి, స్టార్ హీరోయిన్ అనిపించుకున్న సామ్.. ఇకనుంచి ఆ తరహా సినిమాలు చేయకూడదని నిశ్చయించారట. కథానాయిక ప్రధానంగా ఆమె నటించిన యూ-టర్న్, ఓ బేబీ సినిమాలు బాగా ఆడాయి. త్వరలో 'మా ఇంటి బంగారం' అంటూ మరో లేడీ ఓరియెంటెడ్ కథతో ఆమె రాబోతున్నది.ఇక నుంచి ఇలాగే కేవలం మహిళా ప్రధాన కథల్లోనే నటించాలని, నటిగా తన ప్రతిభని నిరూపించుకునే అవకాశం ఇలాంటి సినిమాల ద్వారానే ఉంటుందని, స్టార్ హీరోల ప్రాజెక్టుల్లో నటించి, పాటలకే పరిమితం కాలేనని సామ్ భావిస్తున్నారట. సమంత లాంటి స్టార్.. సోలో సినిమాలు చేసి హిట్లు కొడితే, అది తోటి హీరోయిన్లకు స్ఫూర్తి దాయకమే. కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా కొత్తకథలు వచ్చే అవకాశం కూడా ఉంది. త్వరలో రానున్న 'మా ఇంటి బంగారం' సినిమా ఓ సామాన్య మహిళ ఎదుర్కొనే సవాళ్లు, ఆమె సాధించే విజయాల నేపథ్యంలో ఉంటుందట.

# రా ఏజెంట్‌గా వెంకీ?



వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రైమ్ కామెడీ ఫ్యామిలీ డ్రామా 'ఆదర్శకుటుంబం -- హౌస్ నెం.47'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఈ సినిమాలో ఓ క్రేజీ ఫ్యాష్‌బ్యాక్‌ని త్రివిక్రమ్ డిజైన్ చేశారట. ఈ ఘట్టం ఆద్యంతం నవ్వులు పూయిస్తుందని ఇన్‌సైడ్ టాక్ ఈ ఎపిసోడ్‌లో వెంకటేశ్ దృష్టి లోపం ఉన్న 'రా ఏజెంట్'గా కనిపిస్తారట. తన కున్న లోపంతో వెంకీ పాత్ర చేసే ఫేజ్‌లు ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటాయని తెలుస్తున్నది. 'మీర్జాపుర్'ఫేం దివ్యేందుశర్మ ఇందులో తీవ్రవాదిగా నటిస్తున్నారు. శ్రీనిధిశెట్టి కథానాయిక. నికితిన్ ధీర్, రావురమేష్ ఇతర పాత్రధారులు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ(చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దసరా కానుకగా సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com